క్లుప్తంగా

మాదిగ హక్కుల దండోరా కార్యదర్శిగా సుమియోన్



వరంగల్: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వరంగల్ జిల్లా కార్యదర్శిగా జన్ను సుమియోన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మయ్య శనివారం అధికారికంగా ప్రకటించారు. మాదిగ హక్కుల పరిరక్షణకు పాటు పడతానని తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి సుమియోన్ కృతజ్ఞతలు తెలిపారు.

29, 30 తేదీల్లో నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్ : ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద 60 ఎంఎల్‌డి మిషన్ భగీరథ నిర్వహణ పనులు చేస్తున్న కారణంగా వరంగల్ అండర్ రైల్వేజోన్ పరిధిలో ఏప్రిల్ 29 నుంచి 30వ తేదీ మధ్యాహ్నం వరకు నీటి సరఫరా బంద్ ఉంటుందని బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. పనుల వల్ల వరంగల్ అండర్ రైల్వే జోన్ పరిధిలోని ప్రాంతాలైన కరీమాబాద్, పెరుకవాడ, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్.ఆర్.ఆర్.తోట, ఏకశిలానగర్, కాశికుంట, ఖిలావరంగల్, దూపకుంట, వసంతాపురం, స్తంభంపల్లి, నక్కలపల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్న పేట ప్రాంతాల్లో నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు అంతరాయంపై సహకరించాలని కోరారు. తదుపరి యథావిధిగా నిర్ణీత సమయాల్లో నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రేపు న్యూసైన్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు.వివరాల కోసం 9701779483 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముఖ్యమంత్రికి టీటీపీ ఆహ్వానం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీటీపీ ప్రెసిడెంట్ కంచరకుంట్ల వంశీరెడ్డి, మల్లిపెద్ది నవీన్‌రెడ్డి, కన్వెన్షన్ రీజనల్ అడ్వైజర్ డాక్టర్ ద్వారకానాథరెడ్డి శనివారం కలిసి మే 24 నుంచి 26 వరకు అమెరికాలో సియాటెల్‌లో జరిగే జరిగే ఈవెంట్‌కు రావాలని ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించారు.

సత్యనారాయణగౌడ్‌ను కలిసిన డీసీపీ

వరంగల్ లీగల్: ఓ హత్యానేరంపై నిందితులకు శిక్ష పడేలా వాదనలు వినిపించిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎం.సత్యనారాయణ గౌడ్‌ను శనివారం వరంగల్ కమిషనరేట్‌లోని డీసీపీ బారీ, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి మార్యాద పూర్వకంగా కలిశారు. సత్యనారాయణగౌడ్‌కు వారు శాలువాతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో సంకట చతుర్థి పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో చైత్రమాస బహుళ చతుర్థి తిథిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సంకటహరచతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ మూలమహాగణపతికి గణపతిసూక్త మూలమంత్రములతో హరిద్రా కుంకుమ, గంధోదకాలతో అభిషేకం, పంచామృతాభిషేకం,అర్చనలునీరాజన మంత్రపుష్పం,నైవేద్యం సమర్పించి మహాహారతి నిర్వహించారు.

మడికొండ: మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి దేవాలయంపై ఉన్న శ్రీ విజయగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, గరికలచే విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీ శ్వేతార్కమూలగణపతి దివ్య క్షేత్రంలో శనివారం రాత్రి సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని నవధాన్యాలతో అభిషేకం నిర్వహించారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట: గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పారిశుద్ధ్య జవాన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మృతుడి కుటుంబానికి వెంటనే రూ.20 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సూపరింటెండెంట్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయ విద్య మిథ్యేనా?

ప్రభుత్వ బీఈడీ కళాశాలను పట్టించుకోరా?

- శిథిలావస్థలో ప్రభుత్వ బీఈడీ కళాశాల
- తరగతి గదుల్లో ఊడుతున్న పెచ్చులు బీటలు వారి, పాకురు పట్టిన గోడలు
- ఒక్క రెగ్యులర్ అధ్యాపకుడూ లేడు
- ప్రిన్సిపాల్ పోస్టుతోసహా 25 అధ్యాపక పోస్టులు ఖాళీ



పాకురు పట్టిన గోడలు



బీఈడీ కళాశాల భవనం గోడలకు ఊడినపెచ్చులు

విద్యారణ్యపురి: వారు విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన భావి ఉపాధ్యాయులు. ప్రస్తుతం వారికి ఉపాధ్యాయ విద్య మిథ్యగానే మారింది. ఒకప్పుడు కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటై ఎంతో మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన హనుమకొండ ప్రభుత్వ బీఈడీ కళాశాల కొన్నేళ్లుగా అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. 1954లో నిర్మితమైన ఈ కళాశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు ఎప్పుడు పెచ్చులూడి మీదపడతాయో అని భయం భయంగా విద్యనభ్యసిస్తున్నారు. వర్షాకాలంలో గోడలు తడిచి పాకురు పడుతున్నాయి. నాలుగైదు ఎకరాల స్థలం ఉన్నప్పటికీ అంతా పిచ్చిమొక్కలతో చెట్లతో నిండి చెత్తాచెదారం కూడి ఉంటుంది. మరోవైపు కళాశాల ఆడిటోరియంలో వర్షపు నీరు నిలుస్తోంది.

డీఈఓనే ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్..

కళాశాలకు ప్రస్తుతం డీఈఓ అబ్దుల్‌హైనే అదనంగా బీఈడీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన డీఈఓగానే ఎంతో బిజీగా ఉన్నప్పటికీ అప్పుడప్పుడు మాత్రమే కళాశాలకు వెళ్తుంటారు. ఏమైనా ఫైళ్లు ఉంటే సిబ్బంది డీఈఓ కార్యాలయానికి వచ్చి సంతకాలు పెట్టించుకుంటారు.

8 మంది గెస్ట్ ఫాక్యల్టీ.. ఐదుగురు ఉచిత బోధన

ఈకళాశాలలో ఒక్క రెగ్యులర్ అధ్యాపకుడు లేడు. ప్రిన్సిపాల్ పోస్టుతో సహా 25మంది అధ్యాపక పోస్టులు ఖాళీలున్నాయి. కొన్నేళ్లుగా రిటైర్డ్ అధ్యాపకులు ఐదుగురు గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. కొన్నాళ్లు వీరు రెమ్యూనరేషన్ తీసుకోగా ప్రస్తుతం వీరు ఉచితంగానే బోధిస్తున్నారు. మరో నలుగురిని గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించారు. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక ఉపాధ్యాయ విద్య మిథ్యగా మారిందనేది సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇక నాన్‌టీచింగ్ ఉద్యోగుల పోస్టులు 23 ఉండగా 22మంది పని చేస్తున్నారని తెలుస్తోంది. క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ కేటగిరీలో ఒక్క పోస్టువేకన్సీగా ఉన్నట్లు సమాచారం. ఈకళాశాలలో బీఈడీ కోర్సులో రెండో సంవత్సరంలో ప్రస్తుతం 62 మంది, ఫస్టియర్‌లో 92 మంది చదువుతున్నారు.

హాస్టల్ వసతేది?

దూర ప్రాంతాల నుంచి కళాశాలలో చేరిన వారికి హాస్టల్ వసతి లేదు. ఒకప్పుడు ఆ కళాశాల వెనుక భాగంలో హాస్టల్ గదుల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా కొంతమేర భవన నిర్మాణం మొదలెట్టి మధ్యలోనే నిలిపేశారు. దశాబ్దంన్నర గడిచినా దాన్ని పట్టించుకునేనాథుడే లేడు. తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు నగరంలో ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఈ నూతన ప్రభుత్వమైనా ప్రభుత్వ బీఈడీ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించి, రెగ్యూలర్ ఫ్యాకల్టీని నియమిస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

పెచ్చులూడున్నాయి..



తరగతి గదుల్లో పెచ్చులూడున్నాయి. భయభయంగా ఉంది. భవనం పూర్తిగా పాకురు పట్టింది. పాడుబడిన భవనంగా మారింది. విద్యాకేంద్రం వాతావరణమే లేదు. రెగ్యులర్ అధ్యాపకులే లేరు. నూతన భవనం నిర్మించాలి. రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి. కళాశాల ఆవరణంతా పిచ్చిమొక్కలతో నిండింది. కొంత స్థలం నర్సరీకి అని ఇచ్చారు. అది కూడా సరిగ్గా నడవడం లేదు. మాకు ఆటలు ఆడుకోవాలని ఉంటుంది. ప్రస్తుతం ఆట స్థలం కరువైంది.

– ఎం.విష్ణు, ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థి

హాస్టల్ సదుపాయం కల్పించాలి



శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ బీఈడీ కళాశాలలో అనేక సమస్యల మధ్య చదువులు వెళ్లదీస్తున్నాం. ఉపాధ్యాయ విద్యకు అనువైన వాతావరణం లేదు. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేదు. గెస్ట్ ఫ్యాకల్టీతో కళాశాల కొనసాగుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ వసతి లేదు. దీంతో కొందరు విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ ఉపాధ్యాయ విద్యను అభ్యసించాల్సి వస్తోంది. నూతన భవనం నిర్మించాలి.

– పి.శ్రావణి, విద్యార్థిని

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



అభివృద్ధి పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లుల్లో కోత తప్పదని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం హనుమకొండ అజర హాస్పిటల్ ప్రాంతంలో నిర్మితమవుతున్న బ్రిడ్జి పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్ణీత ప్రమాణాల మేరకు నిర్మించారో లేదో తెలుసుకోవడానికి కొలతలు వేసి పరిశీలించడంతో పాటు నాణ్యత నిర్ధారణకు కోర్ కటింగ్‌ను పరిశీలించారు. భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ బండ్ పై ఏర్పాటు చేస్తున్న పనులకు సంబంధించిన సమగ్ర వివరణ ఇవ్వాలని శిల్పాలు, స్టోన్‌ల సంబంధిత సమాచారంతో పాటు వాటి నాణ్యతను ఎలా నిర్ధారణ చేస్తారో అధికారులను అడిగి కొలతలు వేయించారు. ఉర్సు బండ్ వద్ద కొనసాగుతున్న రీటైనింగ్ వాల్ పనులను పరిశీలించిన కమిషనర్ అట్టి నిర్మాణాలకు చెందిన నాణ్యతను పరిశీలించి కోర్ కటింగ్‌ను చేసిన తీరు నిర్ధారణ చేశారు. అనంతరం కీర్తి బార్ వద్ద కొనసాగుతున్న స్మార్ట్ సిటీ రోడ్ పనుల నాణ్యతను పరి శీలించి కోర్ కట్టింగ్ నిర్వహింపజేశారు. ఆమె వెంట ఎస్‌ఈ కష్టారావు, ఈఈ లు రాజయ్య, సంజయ్ కుమార్, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, రవి కిరణ్, ఏఈలు, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు ఉన్నారు.

నేడు మీ–సేవా కేంద్రాలు ఓపెన్

ఆస్తి పన్ను 5 శాతం రిబేట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆదివారం నగరవ్యాప్తంగా ఉన్న మీ–సేవా కేంద్రాలు తెరిచి ఉంటాయని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. పన్ను రాయితీని వినియోగించుకునేందుకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉందని తెలిపారు. బల్దియా పరిధిలోని హన్మకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాలు తెరిచి ఉంటున్నందున భవన నిర్మాణ యాజమానులు తమ ఆస్తి పన్ను ముందుస్తుగా చెల్లించి లబ్ధిపొందాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఉర్సుగుట్ట వద్ద చెత్తకు నిప్పు



డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలు

వరంగల్ అర్బన్/ఖిలావరంగల్ : ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట పరిసరాల్లో మహానగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు చెత్తకు నిప్పు అంటుకుంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడుతున్నాయి. డంపింగ్ యార్డ్ వద్ద వెళ్లే పరిస్థితి లేకుండా దట్టమైన పొగ నిండి రాకపోకలు నిల్చిపోయాయి. స్థానిక ప్రజలు కనీసం శ్వాస తీసుకోలేని పరిస్థితి నెలకొంది. చెత్తపూర్తిగా దగ్ధమవుతూ మంటలు పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతుండటంతో స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి అప్రమత్తమయ్యారు. వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులతోపాటు ఫైర్ అధి కారులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన వరంగల్ ఫైర్ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో రెండు ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. డంపియార్డ్‌లో ఎగిసి పడుతున్న మంటలను ఫైర్ సిబ్బంది ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నారు.

మోదీ పాలనలో దేశం సురక్షితం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరూరి రమేశ్

హసన్‌పర్తి : ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. హసన్‌పర్తికి చెందిన బాక్సర్ సాంబరాజుతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఓటు కోసం అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, దాస్యం అభినవ్‌భాస్కర్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, పెద్దమ్మ శ్రీనివాస్, హరిశంకర్, దాసరి రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెమిని థియేటర్ వద్ద శివనగర్‌కు చెందిన కట్రోజు శుక్లాచారి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. నిందితుడి నుంచి 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగాఇ సీఐ మా ట్లాడుతూ యువత గంజాయికి బానిసలై జీవి తాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా మీ ప్రాంతంలో గంజాయి సేవించినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఫార్మసీ విద్యతోనే దేశం ముందడుగు

ఖిలా వరంగల్: ఫార్మసీ విద్యతోనే దేశం ఎంతో ముందుకు వెళ్తుందని, విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తాళ్లపద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టరెట్ ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ పి.భాగ్యలక్ష్మి, డాక్టర్ మహేష్, కేయూ ప్రొఫెసర్ డాక్టర్ జి.సమ్మయ్య అన్నారు. ఉర్సు కరీమాబాద్‌లోని తాళ్లపద్మావతి ఫార్మసీ కళాశాలలో డైరెక్టర్లు తాళ్ల వరుణ్, వైష్ణవి వరుణ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, బేతి శ్రీనివాస్ నేతృత్వంలో ప్రెషర్స్ డే వేడుకలు జరిగాయి.

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి : హనుమకొండలో జరిగే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డివిజన్ నుంచి వేల మంది తరలిరావాలన్నారు.

ఐక్యంగా పనిచేయండి

హసన్‌పర్తి : లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి పార్టీ బలపరిచిన కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు సూచించారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు.

నిరక్షరాస్యత వల్లే వెనుకబాటు

హసన్‌పర్తి: నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలే వెనుకబాటుకు కారణమని ఉందని శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి అన్నారు. నగరంలోని శివాని డిగ్రీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం చింతగట్టుక్యాంప్‌లోని తిరుమల్‌రెడ్డి కన్వన్షన్ హాల్‌లో శనివారం జరిగింది. కార్యక్రమానికి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నాగూర్ల సంజీవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను గుర్తించాలి

కాజీపేట: తెలంగాణ ఉద్యమకారుడిగా, జెడ్పీ చైర్మన్‌గా మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని వివరిస్తూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను గుర్తించాలని ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ పరిధిలోని 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై శనివారం తెల్లవారుజామున వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన కలిసి కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందనలు



హసన్‌పర్తి: ఇంటర్ ఫస్టియర్ బీపీసీలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన గౌతమ్ కళాశాల విద్యార్థిని నాగపురి హాసిని(438 మార్కులు)ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అభినందించారు. సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

వైభవంగా శ్రీగంగమ్మ తల్లి బోనాలు

ఖిలా వరంగల్ : వరంగల్ రంగశాయిపేట శివారులోని బెస్తం చెరువు కట్టపై గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీగంగమ్మ తల్లి, పోతరాజుకు మహిళలు వైభవంగా బోనాలు సమర్పించారు. శనివారం రాత్రి రంగశాయిపేట పురవీధుల్లో నుంచి మహిళలు కొత్తబట్టలు ధరించి నెత్తిన బోనాన్ని పెట్టుకుని డప్పు చప్పులు, మంగళ వాయిద్యాలతో నడమ చేరుకుని శ్రీగంగమ్మ తల్లికి పర్వన్నాన్ని సమర్పించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

హసన్‌పర్తి: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 1వ డివిజన్ ముచ్చర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు.

మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

ఖిలా వరంగల్ : కార్మికులందరూ సమష్టిగా మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమి టీ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. వరంగల్ మధ్యకోటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం 138వ మేడే వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కాజీపేట: నగరంలోని 63వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానిక సీఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. కాజీపేటకు చెందిన జన్ను ఐలేష్ (45) ప్రైవేట్ ప్లంబర్‌కు 20 ఏళ్ల కింద సునీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్దికాలం బాగానే కలిసి ఉన్నప్పటికీ ఐలేష్ తాగుడుకు బానిసగా మారి తరచూ ఇంట్లో గొడవలు పడ్డుండేవాడు. పది నెలల కింద భా ర్య, పిల్లలతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయి రహమత్‌నగర్‌లోని సోదరి ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఐలేష్ అంబేద్కర్ నగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి భార్య, పిల్లలకు సమాచారం అందించారు. మృతుడి భార్య సునీత తన భర్త మరణంపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్ : మద్యం మత్తులో పిలిచి దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్సై మున్నీరుల్లా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫారం సమీపాన శివనగర్ వైపులోని తిరుమల బార్‌లో శంభునిపేటకు చెందిన సయ్యద్ ఉమర్, శివనగర్‌కు చెందిన ఎండీ. ఖాజా మద్యం సేవించి ఇంటికి వెళ్తున్నారు. రోడ్డు పక్కన గద్దెలపై కూర్చున్న ట్రాన్స్‌జెండర్‌తో కలిసి రాఖీ, శరత్ మద్యం సేవిస్తున్నారు. అటుగా వెళ్తున్న ఉమర్, ఖాజాలను అరే ఇటు రాండి అంటూ రాఖీ పిలిచారు. ఏరా పిలిస్తే రావటం లేదని ఆగ్రహానికి గురైన రాఖీ బీర్ సీసాతో ఉమర్ తలపై కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ట్రాన్స్‌జెండర్‌తో పాటు రాఖీ, శరత్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికులు వెంటనే ఖాజా, ఉమర్‌ను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శనివారం బాధితుడు ఉమర్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డికి విన్నవించి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే డీఐఈవో దృష్టికి తీసుకెళ్లామని అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

గోశాలలో గోమాతలకు పూజలు

ఖిలా వరంగల్: ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా శనివారం ఉర్సు కరీమాబాద్‌లోని శ్రీసీతారామస్వామి గోశాలలో పశుసంవర్ధక శాఖ నాన్ గెజిటెడ్ వెటర్నరీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ, కార్యదర్శి ఎస్.సతీష్ ఆధ్వర్యంలో గోమాతలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బలవర్ధకమైన సిరప్‌లు, క్యాల్షియం, మినరల్ సిరప్, మినరల్ మిక్సర్, దాణా పంపిణీ చేశారు.

గిర్మాజీపేటలో ముగిసిన రథోత్సవం



వరంగల్ చౌరస్తా : ప్రసిద్ధ భూ నీలాదేవి సమేత గోవింద రాజస్వామి పెద్ద రథోత్సవం చివరి రోజు శనివారం గిర్మాజీపేటలోని హనుమత్ చంద్రశేఖర శివాలయం వ ద్దకు చేరింది. అర్చకుల బృందం బిందతీర్థం, డో లోత్సవం, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కు మార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ము దిరాజ్ రథసారథి చింతాకుల సునీల్ ఆధ్వర్యంలో రథయాత్ర జంగం వీధి, గుండ్రోళ్లవాడ, బండి నారాయణ వీధి, ముదిరాజ్ వాడల మీదుగా రథయాత్ర గర్భగుడికి చేరుకుంది. మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో స్వాగతం పలికారు.

గంగపుత్ర సంఘం నియామకాన్ని ఖండిస్తున్నాం

కాజీపేట రూరల్ : కాజీపేట గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గ నియామకంను ఖండిస్తున్నట్లు ప్రస్తుత గంగపుత్ర సంఘం కాజీపేట అధ్యక్షుడు కొదిరిపాక వేదప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేటలో రిజిస్టర్ అయి ఉన్న ప్రస్తుత గంగపుత్ర సంఘాన్ని కాదని నగర కమిటీ వేరే సంఘాన్ని నియమించడం సరైంది కాదన్నారు. త్వరలో కాజీపేట గంగపుత్ర సంఘం జనరల్ బాడీ నిర్వహించి ఎన్నికలకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు.

నేత్రాల సేకరణ

హసన్‌పర్తి : అనారోగ్యంతో మృతి చెందిన హనుమకొండ జిల్లా గోపాలపురంలోని భద్రకాళినగర్ రోడ్‌కు చెందిన పానుగోటి సరళ దేహం నుంచి నేత్రాలను సేకరించారు. మృతురాలి కుమారులు విద్యానాథరావు, శ్రీనాథరావు, హరినాథరావుల అంగీకారంతో శనివారం నేత్రాలు సేకరించినట్లు తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: చైత్ర బహుళ చవితి శనివారం సందర్భంగా శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు వెంకటప్రసాద్ మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని విధిగా చదవాలి



అవార్డులు అందుకున్న రచయితలు డాక్టర్ శరత్ చమార్, మచ్చా దేవేందర్

హన్మకొండ: రాజ్యాంగంతో పాటు వాల్మీకి రామాయణాన్ని ప్రజలు విధిగా చదవాలని ప్రముఖ జర్నలిస్టు, సినీ దర్శకులు సొదా అరుణ అన్నారు. శనివారం రాత్రి హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఇంటర్నేషనల్ హిందూ రావణ సేనా వాహిని ఆవిర్భావం జరిగింది. శుక్రాచార్య భగవతి మహా రాజ్ బొడ్రాయి ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలతో ఈ ఆవిర్భావ సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రావణ సేనా పతకాన్ని ఆవిష్కరించారు. ఈ జెండాలో రావణుడు కనుగొన్న వీణ గుర్తును ఉంచారు. ద్రావిడ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా ఈ పతాకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శబరి, శంబూకుడు, శూర్పణఖ వంటి వాళ్ల చరిత్ర ప్రజలు తెలుసుకోవాలన్నారు. నిజమైన మన చరిత్ర మన భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఇంటర్నేషనల్ హిందూ రావణ సేనా వాహిని మహా సేనాని కో ఆర్డినేటర్ డాక్టర్ అరూరి సుధాకర్ మాట్లాడుతూ శోకం లేని అశోక రాజ్యం శ్రీరావణ రాజ్యమన్నారు. రచయితలు డాక్టర్ నలిగంటి శరత్ చమార్, మచ్చా దేవేందర్‌కు రావణ వీణ అవార్డులను అందించారు. అంతకు ముందు అవార్డు గ్రహీతలను అదాలత్ కూడలి నుంచి హరిత హోటల్ వరకు గుర్రాల బండిపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు, అంబేడ్కర్ వాదులు, చరిత్రకారులు, ఔత్సాహిక అధ్యయన, పరిశోధక విద్యార్థులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

మోదీకి ప్రజలు అండగా నిలవాలి

హన్మకొండ: ప్రధాని మోదీకి ప్రజలు అండగా నిలవాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శనివారం హనుమకొండలోని రెడ్డి కాలనీ, దుర్గ కాలనీ, యాదవనగర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావు పద్మ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యాదవనగర్ కూడలి వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్ ప్రసంగించారు. ఎన్నికల్లో పువ్వు గుర్తుకు ఓటు వేసి ఆరూరి రమేష్‌కు గెలిపించాలని కోరారు.

ఖిలావరంగల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం వరంగల్ రంగశాయిపేటలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సామాజిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటరోడ్ కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగే బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా సామాజిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ కోరారు. శనివారం బీజేపీ తూర్పు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.